**కథానిక**

# పందెం

రైల్లో దూర ప్రయాణం చేస్తున్న ఒక యువకుడు ఏమీతోచక ప్రక్కనున్న ఒక గ్రామస్థుడ్ని పలకరించాడు. అతను వృద్ధుడు.

"ఏమయ్యా నాయుడూ. మనిద్దరం ఒక పందెం కడదాం వస్తావా?" అన్నాడు.

"పందెమా? ఏటది?"

"నేను నిన్ను కొన్ని ప్రశ్నలడుగుతాను. నువ్వూ నన్ను అడుగు. ఎవరు జవాబు చెప్పలేకపోతే వారు ప్రశ్న అడిగిన వాడికి ఒక రూపాయి యిచ్చుకోవాలి."

"నేను సదువుకున్నోడిని కాను బాబూ, నువ్వడిగే వాటికి నాకాడున్న సొమ్మంతా సెల్లించాల్సిందే" అన్నాడు వృద్ధుడు.

"పోనీ—నా ప్రశ్నలకి నువ్వు జవాబు చెప్పలేకపోతే ఒక రూపాయి, నీ ప్రశ్నకి నేను జవాబు చెప్పలేకపోతే పది రూపాయలు—సరేనా?"

"సరే—అడగండి."

"పరమాణువు అంటే ఏమిటి? అందులో ఏముంటాయి?"

వృద్ధుడు మాటాడకుండా రూపాయి తీసిచ్చాడు.

"తాజ్‌మహల్ కట్టించిన దెవరు?"

వృద్ధుడు మళ్ళీ రూపాయి తీసిచ్చాడు.

"సరే ఇప్పుడు నువ్వడుగు" అన్నాడు యువకుడు.

"ఇప్పుడు మీరు ఏదో ఇల్లు కట్టించిన దెవరని అడిగినారు కదా."

"ఇల్లు కాదు, తాజ్‌మహల్"

"అంటే అర్థమేంటి?"

యువకుడు పది రూపాలిచ్చేశాడు.

"పోనీలెండి బాబూ—రామదాసు కీర్తనలు మా వూళ్ళో పాడుతూంటారు గదా. అవి ఎవరు రాసినారు చెప్పగలరా?"

"ఏ రామదాసు?"

"ఎవడైనా ఒక్కడే గదా?"

"కాదులెండి. మరెందుకు పది రూపాయలిలా పడేయండి."

యువకుడు డబ్బు తీసి యిచ్చాడు.

"మరొకటి అడగమంటా రేటి?"

"అడగవయ్యా, నే నంత సుళువుగా పందెం వదిలేస్తాననుకున్నావా?"

"అయితే సెప్పండి. పాములకు మనుషులకు తేడా ఏటి?"

"పెద్ద తేడా లేదు. పాములూ మనుషులూ కూడా ఇతరులను హింసిస్తారు."

"తప్పు బాబూ. పాములు తినే కరవ్వు. ఆటి ప్రాణానికి ప్రెమాదమొస్తేనే కరుస్తాయి. కాని మనుషులు అలా కాదు బాబూ, తమకు ఉపకారం చేసేవోళ్ళని కూడా కరుస్తారు."

యువకుడు వృద్ధుడికి పది రూపాయలిచ్చి అతని తర్కానికి చాల సంతోషించాడు. "మే మెన్నో విషయాలు చదువుతాము, కాని లోకాన్ని గురించి మీకున్న అనుభవం మాకు లేదు. కాని మీ రైతులకు గడుసుతనం లేదు. అందుకే వైజ్ఞానికంగా మీరు వెనకబడివున్నారు" అన్నాడు.

వృద్ధుడు చిరునవ్వు నవ్వి "అలాగా అయితే ఇదే ఆఖరు, ఒక్కటడుగుతాను చెప్తారా?" అన్నాడు.

"అడుగు చెప్తాను."

"కొండ ఎక్కేటప్పుడు రెండు కాళ్ళతో, ఎక్కి దిగేటప్పుడు నాలుగుకాళ్ళతో దిగే జంతువు పేరేటి?"

యువకుడు రెండు నిముషా లాలోచించి, పది రూపాయలు తీసియిచ్చాడు.

"ఇంక యీ పందెం ఆపేండి చాలు" అన్నాడు వృద్ధుడు.

"సరే, ఇంతకీ ఆ జంతువు పేరేమిటి" అని అడిగాడు యువకుడు.

వృద్ధుడు ఒక రూపాయి తీసి యిచ్చాడు.

(ఒక జానపద కథ ఆధారంగా కల్పితం.)